# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-1, సంచిక-9 16 ఏప్రిల్ - 2014 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## విధ్వంసకర అభివృద్ధికి నిరసనగా 'నోటా' పై ఓటువేయండి

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికలు కొద్దిరోజుల్లో జరగబోతున్నాయి. కాంగ్రెస్, బి.జె.పి. తెలుగుదేశం టి.ఆర్.ఎస్ పార్టీలు మానిపెస్టోలు ప్రకటించారు. అగ్రకుల నాయకత్వాన్ని ఆయా పార్టీల్లో స్థిరపరచుకుని, ఉత్పత్తితో సంబంధం లేని పెట్టుబడిదారీ యాజమానులు/మేనేజర్ల ఆధ్వర్యంలో పెట్టుబడిదారీ మార్కెట్ సామాజికంగా భౌగోళికంగా విస్తరణ ప్రణాళికలు ప్రకటించాయి. లోకవిద్యాధర సమాజం యొక్క సంక్షేమం రైతులు, వృత్తిదారులు, ఆదివాసులు, దళితులు, చిన్నదుకాణాదారులు, మైనారిటీలు మొ॥ వర్గాలకు ఈ ప్రణాళికలో స్థానంలేదు. ఒక్క మాటలో ఈ ప్రణాళికలు లోకవిద్యకు, లోకవిద్యాధర సమాజానికి ఆటంకంగా వున్నాయి. కాంగ్రెస్, బి.జె.పి., టి.ఆర్.యస్, తెలుగుదేశం మధ్య పోరాటం అల్లా సామ్రాజ్యవాదులకు అనుకూలంగా అభివృద్ధి క్రమానికి అడ్డుగా వున్న వాటిని నిర్మూలించడంను ఎవరు పర్యవేక్షించాలి అనేదే.

ఈ అభివృద్ధి నమూనాకు కొత్తగా వచ్చిన ఆమ్‌ఆద్మీ పార్టీ లోకవిద్యాధరుల సమాజం ప్రయోజనాలకు మద్దతుగా ముందుకొచ్చిన ప్రత్యామ్నాయ పార్టీ అని ప్రజలు భావిస్తున్నారు. ఈ పార్టీ పుట్టుక, స్వభావంను పరిశీలించవలసి వుంది. ప్రపంచీకరణ సమాచార ఐ.టి. గత 2 దశాబ్దాల కాలంలో కొత్తగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్న ఒక నూతన ప్రొఫెషనల్ వర్గం నుంచి ఈ పార్టీ ఆవిర్భవించింది. ఉన్నతవిద్యావంతులైన వ్యక్తులు సోషల్ మీడియా ద్వారా అనుసంధానమై ఈ పార్టీనీ నడిపిస్తున్నారు. ఈ నూతన వర్గానికి మిగతా అధికార వర్గాలతో పోల్చిచూస్తే ప్రజలతో ఉన్న సంబంధాలు అతి తక్కువ అని తెలుస్తోంది. గడిచిన 5 ఏళ్ళ కాలంలో ఈజిప్టు, టర్కీ, టూనిషియా, సిరియా, థాయ్‌లాండ్, ఉక్రెయిన్, అమెరికా వంటి దేశాల్లోని వివిధ నగరాల్లో తలెత్తిన ఉద్యమాలకు ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమానికి స్వభావరీత్యా ఒకేలా వున్నాయి. ఈ అన్ని ఉద్యమాలలోనూ ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియానే కీలకపాత్ర పోషించింది. ఈ ఉద్యమాలన్నింటికి కూడా పాశ్చాత దేశాలనుండి, వారి మీడియానుండి మద్దతు లభించింది. ప్రజాస్వామ్యం పేరుతో బయలుదేరిన ఉద్యమాలు చాలా సులువుగా సాయుధ బలగాలతో చేతులు కలపడం కూడా చూస్తాం. లోకవిద్యాధర సమాజానికి సంబంధించిన రైతులు, చేతివృత్తులవారు, ఆదివాసీలు, ఆమ్‌ఆద్మీపార్టీ చేసే చర్చలలో ఎక్కడా ప్రస్తావనకు రారు. ఈ ఉద్యమం కేవలం పట్టణ ప్రాంతాలకు మాత్రమే సంబంధించింది. పట్టణ పేదల పరిస్థితులపై మాత్రమే వీరు స్పందించారు. అయితే చిరకాలంగా వున్న రాజకీయ వ్యవస్థను ఒక కుదుపు కుదిపినంత వరకు ఆమ్‌ఆద్మీపార్టీని స్వాగతించవలసిందే. పెట్టుబడిదారీ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని ఆమ్‌ఆద్మీ పార్టీ స్పష్టంగా చెప్పింది. ముఖేష్ అంబానీ, అదానీపైన ఆమ్‌ఆద్మీపార్టీ విమర్శలు చేసినప్పటికీ పెట్టుబడిదారీ విధానానికి, కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకం కాదు. అవినీతి నిర్మూలన, పరిపాలనా సంస్కరణలు అన్నింటికి పరిష్కారం చూపుతాయన్నది వారి విధానంగా వుంది. రాజకీయ వ్యవస్థను ఒక కుదుపు కుదిపినప్పటికీ అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచార విధానాలను గమనిస్తే స్థానిక రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు రాజకీయ ప్రక్రియలో వారు ప్రజలకు దూరమవుతున్నారని తెలుస్తోంది. ఈ మొత్తం ప్రక్రియ నూతన ప్రజా రాజకీయాల అవసరాన్ని గుర్తింపచేస్తోంది.

సామాజిక ఉద్యమాల్లో ఆరితేరిన ఎంతోమందిని ప్రముఖ ఉద్యమకారులు, ఆమ్‌ఆద్మీపార్టీ టిక్కెట్ పైన ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్దమయ్యారు. ఈ సామాజిక ఉద్యమాలన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ ఎన్నికల రాజకీయ ప్రక్రియలో విలీనమైనట్లు కనబడుతోంది. ఆమ్‌ఆద్మీపార్టీ ఏదో సాధించకలదన్న భావన కంటే కూడా ప్రస్తుత సామాజిక ఉద్యమంగా ఉన్న అవకాశాలు కనుమరుగవుతున్నాయన్న స్పృహతోనే ఆపార్టీలోకి చేరారని భావించవచ్చు. దేశవ్యాప్తంగా వివిధ ఉద్యమాలల్లో, ఆందోళనలతో సంబంధమున్న సామాజిక కార్యకర్తలు, సామాజిక ఉద్యమాలను ఏవిధంగా పునర్నిర్మాణం చెయ్యాలన్న విషయం తీవ్రంగా ఆలోచించవలసి వుంది.

ఏంచెయ్యాలి?

70 కోట్ల ఓటర్లు 100 కోట్ల ప్రజలు ఉన్న లోకవిద్యాధర సమాజం గురించి, వారి సమస్యల గురించి ప్రధాన రాజకీయ పార్టీలకు ఏమాత్రం పట్టింపులేదు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ ఎప్పటికి తమ డిమాండ్లను నెరవేర్చలేదని ఓటర్లకు చైతన్యం కలిగించడానికి సమాజం డిమాండ్లను పార్టీలు పట్టించుకునేలా చేయడానికి మనం కృషి చేయ్యాలి.

మన డిమాండ్లు :

1. లోకవిద్య కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలి.
2. నీరు, విద్యుత్, విద్య, ఆరోగ్యం, ఆర్థిక వనరులతోపాటు జాతీయ వనరులను ప్రజలందరికి సమానంగా పంపిణీ చేయాలి.

ఈ డిమాండ్లను బలపరిచి, వాటిని నెరవేర్చడానికి కృషిచేస్తామని ప్రజలలో ప్రతిజ్ఞ చేసే అభ్యర్థులకే ఈ ఎన్నికల్లో ఓటు వేయ్యాలి.

అలాకాని పక్షంలో రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా చేస్తున్న సత్యాగ్రహంగా భావించి 'నోటా' అవకాశాన్ని వినియోగించుకోవాలి.

ప్రధాన స్రవంతి రాజకీయాల పైన ప్రజల రాజకీయ నిరసనకు గుర్తుగా ఎన్నో దశాబ్దాల కితం మనం "చెల్లని ఓట్లు" ప్రచార కార్యక్రమం ప్రారంభించాం. 30 ఏళ్ళ తర్వాత ఈ ఉద్యమం నోటా అవకాశంగా రూపుదిద్దుకొంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు యాంత్రికంగా మద్దతిచ్చే వారిలో కూడా ప్రస్తుత ఎన్నికల ప్రక్రియపైన నెలకొన్న నిరసనకు ప్రతీకగా ఈ నోటాను భావించాలి.

లోకవిద్యను మన జీవనోపాధిని అంతిమంగా మన జీవితాలను విధ్వంసం చేస్తున్న విస్తరణ వాదాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ మద్దతుదారులకు వ్యతిరేకంగా మన సత్తాను చాటడానికి మనం ఈ నోటా అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలి.

- ప్రొ॥ క్రిష్ణరాజులు

## కేజ్రీవాల్ స్వరాజ్‌పై ఒక విశ్లేషణ

కేజ్రీవాల్ స్వరాజ్ ఆధారంగా ఏప్రిల్ 1న ప్రచురించిన లోకవిద్యా ప్రపంచం వ్యాసంలో దేశంలో పంచాయితీరాజ్ వ్యవస్థలో, లోపాలు, బ్రిటీష్ వారికి ముందు కాలంలో గణ వ్యవస్థలో ప్రజాస్వామ్య పద్ధతులు, బ్రిటీష్‌వారి కాలంలో ప్రవేశపెట్టిన కలెక్టర్ రాజ్ అధికారాలన్నీ కలెక్టర్‌కు కట్టపెట్టి గ్రామసభలకున్న అధికారాలు రద్దుచేయడం, స్వాతంత్ర్యానంతరం గ్రామసభలను పునరుద్ధరించకపోవడంతో ప్రజలకు అధికారం రాలేదని, గ్రామసభలకు పూర్తి అధికారాలు సాధించడం ద్వారానే నిజమైన స్వరాజ్యం లభిస్తుందని చెప్పడం అవగాహనపరంగా బాగానే వున్నా ఆచరణలో కొన్ని సమస్యలు పరిశీలించాల్సివుంది.

1. బ్రిటీష్‌వారి ముందుకాలంలో గణ వ్యవస్థ రూపం నేటి గ్రామసభల రూపం మధ్య తేడాలు.
2. భూమి వ్యక్తిగత ఆస్తిరూపంలో కాకుండా రాజ్యానికి చెంది వుండడం.

బ్రిటీష్ వారి ముందుకాలంలో గౌతమబుద్ధుడి కాలంలో వున్న గణతంత్ర వ్యవస్థలో వ్యవసాయం చేసి రాజుకు కప్పం కట్టే రైతులందరు సభ్యులు. భూమిలేని కూలీలకు, సేవాకులాలకు ఇందులో భాగస్వాములు కారు. అయినప్పటికీ ఆనాడు వ్యవసాయం చేసే రైతుల ప్రయోజనం మేరకయినా వాటి పాత్ర నేటితో పోల్చుకుంటే మెరుగుగా వున్న విషయం వాస్తవం.

ఈనాడు ప్రభుత్వం గ్రామ సభల పేరుతో జరిపే తంతులో జరుగుతున్న దానికి భిన్నంగా ఏంచేయాలి? ఈనాడు పాలకులు గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాల పేరుతో, సంక్షేమ కార్యక్రమాల పథకాలకు నిధులు కేటాయించి వివిధ శాఖల అధికారుల ద్వారా గ్రామ సభల అనుమతి పేరుతో ప్రకటిస్తున్నారు. సరిపడా బడ్జెట్ కాకుండా తక్కువ మొత్తాలు విడుదల చేయడం పథకాల అమలులో మార్పులు చేయడం గాని, అవకతవకలపై చర్యలు తీసుకునే అధికారం గ్రామ సభలకు లేదు.

రాజకీయ నాయకులు వారి అనుయాయులైన కాంట్రాక్టర్స్ ఈ పథకాల అమలులో కీలకపాత్ర నిర్వహిస్తున్నారు. సర్పంచ్‌లు కాంట్రాక్టర్లకు నామినేషన్‌లపై పనులు ఇవ్వడం, టెండర్ల ద్వారా జరిగే భారీ పనులు కాంట్రాక్టర్లుగా ఎదిగిన ఆధిపత్యకులాల వారే చేయడం, వేరే వారిని రానీయకపోవడం నిబంధనల పేరుతో జరిగే పనులలో అవకతవకతలు జరిగినా ప్రజలు జోక్యం చేసుకునే అవకాశం లేదు. సర్పంచ్‌లు, అధికారులు, నామినేషన్ల పై పనులివ్వడం రద్దుచేసి గ్రామ సభల నిర్ణయం మేరకు ఎంపిక చేసిన గ్రామస్థులకే పనులివ్వాలి. 5 లక్షల రూపాయల పైబడిన పనులను కూడా టెండర్ ప్రక్రియ ద్వారా కాకుండా గ్రామీణ ప్రాంతంలోని చిన్న కాంట్రాక్టర్లకి, దశల వారీగా గ్రామ సభలు నిర్ణయించిన వారికే ఇవ్వాలి.

వివిధ పథకాల పేరుతో కేటాయిస్తున్న వాటిని డబ్బు రూపంలో ఇవ్వాలని, గ్రామసభల నిర్ణయం మేరకు అవసరాలకు వినియోగించి మిగులుకు వైద్యం, విద్య అవసరాలకు వినియోగించడంపై - పథకాల రూపకల్పనలో ఇందిరమ్మ ఇల్లు పేరుతో లక్ష రూపాయలు కేటాయించిన మొత్తాలు సరిపోక ప్రతీ ఒక్కరూ మైక్రో రుణాలు, ఇతరత్రా అప్పుల బారిన పడి రుణగ్రస్తులవుతున్నారు. రెండు రూపాయలకు కిలో బియ్యం అర్హతలతో సంబంధం లేకుండా తెల్లకార్డులు జారీచేసి, ఆ బియ్యంను 10 రూ॥లకు అమ్మి మరల 20 రూ॥లకు కిలోబియ్యం

కొనుక్కొంటున్న పరిస్థితి వుంది. ఆరోగ్యశ్రీ పేరుతో నాసిరకం పరికరాలతో 30 వేల రూ॥లో చికిత్స జరిపి లక్ష రూ॥లు కార్పొరేట్ ఆస్పత్రులు దోపిడి చేస్తున్నాయి. ఈ మొత్తాలను ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించి నిపుణులైన డాక్టర్లతో వైద్యం చేయిస్తే ప్రజలందరికి అన్ని జబ్బులకి ఉచితంగా చికిత్స చేయించవచ్చు. ఈ పథకాల అమలుపై గ్రామసభలు చర్చించి అవసరమైన మేరకు మార్పులు చేసి ప్రజలకు భారంకాకుండా ఉండే పద్ధతిలో అమలుచేయాల్సి వుంటుంది.

గ్రామసభలలో ప్రాతినిధ్యం సమంగా లేదు. చిన్నతరహ వ్యవసాయదారులున్నారు. వ్యవసాయం చేయకుండా పట్టణ ప్రాంతాలకు వలసపోయి కౌలుకిచ్చిన రైతులున్నారు. వ్యవసాయం కన్నా వ్యాపారంలో లాభాలు రావడంతో పట్టణ ప్రాంతాలలో వ్యాపారాలలో స్థిరపడి భూములు పడావుపెట్టిన (తెలంగాణాలో) భూస్వాములున్నారు. ఏ భూమిలేని వ్యవసాయ కూలీలున్నారు. ప్లాస్టిక్ వాడకం, పారిశ్రామిక వస్తువుల ప్రవేశంతో వృత్తులకు ఆదరణ తగ్గిపోయి వలసపోగా కొద్ది సంఖ్యలో సేవాకులాల వారున్నారు. మెజారిటీ ప్రజలు ఏరకమైన ఆస్తిలేకుండా కూలీపని పై ఆధారపడి, జీవిస్తున్న వారున్నారు.

బ్రిటీష్‌వారి తదనంతరం జమీందారి విధానం రద్దయి కౌలుదారులుగా వున్న రైతులకు భూమి బదిలీ అయింది తప్ప ప్రజలందరికీ అన్ని వర్గాల వారికి భూమి రాలేదు. దున్నేవాడికి భూమి నినాదం వలన కౌలుదారులకు భూమి దక్కింది. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కౌలు రైతులకు భూమి, వ్యవసాయ కూలీలకు కూలీరేట్ల పెంపు సాధించడం జరిగింది కానీ భూస్వాముల భూమిని ప్రజలందరికి సాధించే వైపు పోరాటం జరగలేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రక్రియ వైపు మార్పు తీసుకొన్న వామపక్ష శక్తులు చీలికలకు, సైద్ధాంతిక వైఫల్యంతో చట్టబద్ధమైన కార్యక్రమాలకే పరిమితమయిపోయారు. ప్రజలందరికి భూమి కోర్కెను సాధించాలంటే అమలులోవున్న వ్యక్తిగత ఆస్తి హక్కుని పక్కన పెట్టాలి. భూమిని జాతీయం చేయ్యాలి. ఈ వైపు పయనించడంలో ప్రగతి శీల శక్తుల వైఫల్యం ఫలితంగా అసమానతలు దీర్ఘకాలం కొనసాగాయి. భూమి ఆధిపత్యకులాలలోనే కొద్దిమంది చేతిలో వుండడం, వాణిజ్య, దేవదాయ, విడాకుల పేరుతో భూమి ఆధిపత్య కులాల చేజారిపోకుండా పనికి మాలిన నీటి వసతిలేని గుట్టలు, కొండలు, మిగులు భూమిగా తేలినా, కోర్టు కేసులలో చిక్కి దీర్ఘకాలం 20 సం॥రాలలో కొద్ది భూమి మాత్రమే పేదలకు దక్కింది. కాల్వ కింద భూములు, మాగాణి ప్రాంతాల్లో ఆధిపత్యకులాల వారి పొలాలమధ్య దేవాదాయ భూమి సైతం బడుగు వర్గాలకు ఇవ్వడానికి నిరాకరించిన ఫలితంగా తిమ్మసముద్రం (ప్రకాశంజిల్లా), గోదావరి జిల్లాల్లో దళితులపై దాడులు జరిగాయి.

భూమిని జాతీయం చేసి వ్యవసాయం చేసే గ్రామ ప్రజలందరికి పంచకుండా, వ్యవసాయం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకున్న వర్గాలు విద్యను అభ్యసించి ఉద్యోగాల్లోకి రావడం ద్వారా ఆర్థిక సమానత్వం సాధ్యమవుతుంది. దేశంలో ఈ క్రమం శూద్రఅగ్ర కులాల వారికే సాధ్యమైంది. అందుకే గ్రామీణ ప్రాంతాలలో భూమి కొద్దికులాల మధ్య వారసత్వంగా సంక్రమిస్తూ, అభివృద్ధి క్రమంలో ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, ఎరువులు వంటి ఆధునిక విధానాలకు మార్పుతీసుకున్న వారు మాత్రమే అభివృద్ధి అయి పైకి వచ్చారు. ఈ వర్గాల నుండి చదువుకున్న వారు మాత్రమే ఉద్యోగాల్లో ప్రవేశించారు. రిజర్వేషన్ల ఫలితంగా, స్కూళ్ళలో చదివిన కొద్దిమంది కింది వర్గాలవారికి కొద్ది ఉద్యోగాలు లభించాయి. ఏ భూమిలేకుండా కూలీపనులు చేసుకునే మెజారిటీ ప్రజలు చదువులో, ఉద్యోగాల్లో ప్రవేశించలేకపోయారు. (పల్లెను మింగిన పెట్టుబడి) శ్రీకాకుళం జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అధ్యయనం వివరాల్లో భూమి ఏ కులాలనుండి ఏ కులాలచేతుల్లోకి వచ్చింది. విద్య, ఉద్యోగులు, వ్యాపారులు ఏవిధంగా ఈ కులాల చేతుల్లోనే వున్నాయో గణాంకాల ఆధారంగా నిరూపించారు.

గ్రామీణ ప్రాంతాల్లో వున్న అసమానతలు నిర్మూలన దిశగా భూమిని జాతీయం చేయడం, మౌలిక సౌకర్యాలు, విద్యుత్, నీరు, ఎరువులు, బ్యాంక్ రుణాల లభ్యత, మార్కెట్ సహకారం లేకుండా ప్రజల అభివృద్ధి సాధ్యంకాదు.

ఈ నేపథ్యంలో వ్యవసాయంపై శ్రద్ధలేకుండా, పట్టణ ప్రాంతాలకు వలసపోయిన వారి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, దేవదాయ, ప్రభుత్వ బంజరు భూములు ప్రజలకు సమానంగా పంచకుండా మౌలిక సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోకుండా గ్రామంలో అన్ని కులాల ప్రజల మధ్య సమానత్వం సాధ్యంకాదు.

గ్రామీణ ప్రాంతాలలో వున్న అసమానతలు ఈనాటి ఎన్నికల ప్రక్రియలో స్పష్టంగా కనిపిస్తోంది. భూమి డబ్బు, వనరులు, అధికారం వున్న ఆధిపత్య వర్గాలే మెజారిటీతో సంబంధం లేకుండా తమ కనుకూలంగా వుండే వారిని ఎన్నికల్లో నిలబెట్టి తమ ప్రయోజనాలు నెరవేర్చుకోగలుగుతున్నాయి. గ్రామాల్లో వుండి వ్యవసాయం చేయని ఆధిపత్య కులాలవారు, రాజకీయ ప్రతినిధులు, ఆ వనరులపై వారి పెత్తనాన్ని రద్దు చేయకుండా గ్రామసభలలో ప్రజలందరి అధికారం సాధించడం సాధ్యంకాదు. ఒక్కమాటలో మెజారిటీ ప్రజలకు భూమి, వనరులపై అధికారం కట్టపెట్టడం ద్వారానే ప్రజాస్వామ్య యుతంగా గ్రామాలు సమిష్టి నిర్ణయాలకు తద్వారా గ్రామసభలు పూర్తి అధికారాన్ని చెలాయించగలుగుతాయి. ఈ అసమానతల గూర్చి ప్రస్తావించకుండా గ్రామసభలు, సమిష్టి నిర్ణయాలు అంటే ఆచరణలో ఆధిపత్య వర్గాలే లబ్దిపొందుతాయి. ప్రజలకు అనుకూలంగా నిర్ణయాలు చేసే సమానత్వ ప్రాతిపదికను ఏర్పరచకుండా ఇది అమలుకాదు. గ్రామ ప్రజలకు నిజమైన స్వరాజ్యం లభించేందుకు కృషి చేసేవారు. ఈ అంశాలను పరిష్కరించకుండా ముందుకుపోలేరు.

**- కె.జె. రామారావు**

# పర్యావరణ విధ్వంసకర అభివృద్ధిని తిరస్కరించండి

మళ్ళీ ఎన్నికలొచ్చాయ్. కలల ప్రపంచాన్ని సాకారం చేస్తామని వాగ్దానాలు కో కొల్లలు. నోట్లతో ఓట్లు కొనడాలూ, సారాయి వరదలై పారడాలూ మామూలే. ఏదో పార్టీ గెలుస్తుంది. లేకుంటే జతలు కట్టి అధికారంలోకి వస్తాయి. జనం బ్రతుకులు షరా మామూలే. రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ నీటి మూటలే.

పారిశ్రామికీకరణ వలనే ఆర్థికాభివృద్ధి చెందుతామన్న ఆలోచనా విధానానికి సమాజంలో విస్తృతమైన ఆమోదముద్ర కల్పించారు. ఆర్థికాభివృద్ధి పెట్టుబడి పరిమితిగా వున్న స్థాయినుండి పరిణామం చెంది సహజ వనరులు పరిమితమైన స్థితికి చేరింది. అంటే ప్రపంచం మనుషులూ, వారి పెట్టుబడీ సాపేక్షంగా శూన్యంగా వున్న స్థితి నుండి వాటితో నిండిన ప్రపంచంగా మారింది. "ఈనాటి విస్తృతంగా పెరిగిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నేపథ్యంలో, అది హద్దులు లేని ఇకో అవరణంలో నడుస్తోందన్నట్లుగా సమాజం ప్రవర్తించడం సబబు కాదు. నియత జీవావరణంలో సుస్థిరంగా మనగల ఆర్థిక వ్యవస్థని వృద్ధి చేయాలంటే నూతన ఆలోచనా మార్గాలు కావాలి"అంటారు. ప్రముఖ ఆర్థిక వేత్త హెర్మన్ డేలి.

ప్రగతిశీల మేధోశక్తుల పతనం, ఏవిధంగానైనా సంపాదించడమే ధ్యేయమైన సంస్కృతి విస్తరణా నేపథ్యంలో కొత్త ఆలోచనలను సమాజంలోకి తీసుకువెళ్ళడం బృహత్కార్యం. నయా ఉదారవాద విధానాలను బలోపేతం చేసుకోవడానికీ, భూములనూ, సహజ వనరులనూ లాక్కోవడం, పర్యావరణ విధ్వంసం చేయడానికి వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను బలహీన పరచడానికీ, ధనిక వర్గాలు ప్రభుత్వాలను వినియోగించుకుంటున్నాయి. ప్రపంచ మంతటా యీనాటి పెద్ద సమస్య దిగజారుతున్న ప్రజాస్వామ్యం, పాలన. ప్రజలు ఎవరిని గెలిపించినా, ఓడించినా విజేతలు సంపన్నులే. భారత ప్రభుత్వం ఈ రోజు అంబాని దుకాణంలా తయారయింది. ఈ రోజు మన ముందున్న ప్రథమ కర్తవ్యం ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి, పునర్జీవింపజేయడం; ప్రజలు భాగస్వాములై నిర్ణయాధికారం సాధించుకునే శక్తిపరులుగా మారేలా చేయడంగాని, 5 సంవత్సరాల కొకసారి ఓటు వేయడానికి మాత్రమే కాదు. 2001 లో వరల్డ్ ట్రేడ్ సెంటరు పై జరిగిన విమాన దాడిలో బ్రతికిన వ్యక్తి అనుభవాలను 11 మార్చి 2014 నాటి నేషనల్ పత్రిక వ్యాసంలో రెబెక్కా సోల్నిట్ ఉదహరించారు.

66వ అంతస్తులోని తన ఆఫీసులోకి కాఫీని పట్టుకుని ప్రవేశిస్తూ, సంబరాలలో పైనుండి వెదజల్లే రంగురంగు రంగుల కాగితపు ముక్కలు లాగా ఏదో బయట పడుతుండడాన్ని చూశాడు (అది 66వ అంతస్తులో సహజంగా జరిగేది కాదు). ఇంతలో అతని స్నేహితుడొకరు "వాళ్ళు వెనక్కొచ్చారని" అరుచుకుంటూ సమావేశం గది నుండి పరుగున బయటకు వచ్చాడు.

అది సెప్టెంబర్ 11 ఉదయం. అతని స్నేహితుడు వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఉత్తర గోపురంని విమానం గుద్దడాన్ని చూశాడు. అతను స్నేహితుడుతో కలిసి క్రిందికి వెళ్ళేందుకు ఎలివేటర్‌లోకి వెళ్ళాడు. ఇంకో పదిహేను నిమిషాలలో అది శీఘ్ర మరణానికి రాచబాట. వాళ్ళెలాగో సురక్షితంగా 44వ అంతస్తు నడవాలోకి చేరారు. అక్కడొకతను అందరూ తమ తమ కార్యాలయాల్లోకి వెళ్ళాలని ప్రకటిస్తున్నారు.

అక్కడికి చేరిన ఇతరులెందరో లాగే, ఎలివేటర్ ఎక్కకుండా మెట్ల మీదుగానే కిందకి చేరుకోవాలని నిశ్చయించుకున్నాడు. అతను 20వవ అంతస్తు చేరే సరికి అందరూ తమ కార్యాలయాల్లోకి వెళ్ళాలని పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లో ప్రకటన వెలువడుతోంది. నాకు ఇదంతా చెబుతున్న అతను సూచన పాటిద్దామా అనుకున్నాడు. క్రిందికి దిగి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. ఎలివేటర్‌లో ఎక్కుదామా అని ఆలోచించి, మెట్లు దిగడం మొదలెట్టాడు. అదే సరైన నిర్ణయం. అతను 9వ అంతస్తుకి చేరే సరికి రెండవ విమానం దక్షిణ గోపురాన్ని గుద్దడంతో ఎలివేటర్‌లలోకి మండుతున్న ఇంధనం పడి అందులో వున్న వారు (200-400 మంది) దుర్భర మరణం పొందారు.

**ఈ కథలో నీతి :** ప్రజా ప్రతినిధులూ, అధికారులూ ప్రపంచం మారిపోయిందనీ, పాత నియమాలు పనిచేయవనీ గ్రహించలేని మొద్దావతారాలుగా వున్నారు. ఆ గోపురంలోని సలహాదారులు ఇప్పటికంటే భిన్నమైన పాత సంక్షోభానికి తగ్గ గొప్ప సలహాలనే ఇచ్చారు. చాలామంది సరైన అవగాహనతో ఆ సలహాను తిరస్కరించి ముందుగా మెట్లపైగా దిగిపోవడంతో, రెండవసారి ఖాళీ చేసేప్పుడు మెట్లపై గుంపు తగ్గింది. ఆశ్చర్యంగా రెండు గోపురాలలోనూ, విమానం గుద్దిన దానికి కింది అంతస్తులలోని అధికులు గోపుర యాజమాన్యం సలహాలను పాటించక పోయినందుకు క్షేమంగా బయటపడ్డారు.

**శ్రీఘ్రంగా వెళ్ళడానికి ఎక్కడా లేదు :** కొన్నిసార్లు సాధారణ సమయాలలో సరైన చర్య అసాధారణ సమయాలలో తప్పవుతుంది. ఏదైనా ఆకస్మికంగా జరిగినపుడు యీ విషయం అర్థం చేసుకోవడం సులువు. కాని మార్పు అంచెలంచలుగా జరిగేటప్పుడూ, దానిని అర్థంచేసుకోవడానికి విస్తృతంగా శాస్త్రీయ సమాచారాన్ని అవగాహనచేసుకోవలసినప్పుడు, అది సులువుగా గ్రాహ్యం కాదు.

ఇప్పుడు, మన జీవనాన్ని ఆఫీసు గోపురంగానూ, శిలాజ ఇంధన ఆర్థిక వ్యవస్థని అతి మెల్లగా వచ్చి దానికి తాకిన విమానంగానూ ఊహించుకోవచ్చు. మండుతున్న విమాన ఇంధనం మనం నిత్యం తగలబెడుతున్న శిలాజ ఇంధనాలకు ఒకరకంగా మంచి సామ్యం. పెను తుఫానులొచ్చి జనం నీళ్ళలో పడి చస్తున్నపుడు, అడవులు కాలిపోతున్నప్పుడు, తీవ్రమైన వడగాల్పులప్పుడూ తప్ప మిగిలిన సమయాలలో చావు, విధ్వంసం నెమ్మదిగా జరుగుతున్నాయి. ఇక్కడ సమస్య మంటలను చూడడానికి నిరాకరించే వ్యక్తిని ఇంటికి నిప్పంటుకున్నదని ఎలా ఒప్పించగలమన్నది? (మంటలనే తిరస్కరించే వారిక్కడ అప్రస్తుతం) సాధారణ సమయాలలో ప్రాజ్ఞ ప్రవర్తనైనది ఇప్పుడు ప్రమాదకరమనీ, ఇతర సమయాలలో దుస్సాహస ప్రవర్తగా భావించేది ప్రస్తుతం ప్రాజ్ఞమనీ ఇతరులనెలా సమాధాన పరచగలం".

పైన ఉదాహరించిన దానిని బట్టి నేను చెప్పదలుచుకున్నది మనం ఇప్పుడు సాధారణ పరిస్థితులలో లేమనీ, గతంలో అభివృద్ధిగా భావించినదంతా నిజం కాదని. శాస్త్రవేత్తలూ, మేధావులూ గత రెండు దశాబ్దాలుగా మన మెంచుకున్న ప్రకృతితో ఘర్షణ మార్గం ప్రమాదాలపై హెచ్చరికలు చేస్తూనే వున్నారు. నోబెల్ గ్రహీతలూ, ఇతర శాస్త్రవేత్తలూ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ, ఎంచుకోవలసిన విధానాలపై కొన్ని ప్రశ్నలు లేవనెత్తుతున్నాను.

"మానవులు, సహజ ప్రపంచం ఘర్షణలో వున్నాయి. మానవ కార్యకలాపాలు పర్యావరణం మరియు వనరులకు తీవ్రమైన తిరుగులేని నష్టాన్ని కలిగిస్తాయి. దీనిని ఆపలేక పోతే ప్రస్తుత మన పద్ధతులెన్నో మానవ సమాజానికీ, వన్యప్రాణి సముదాయానికీ మనం కోరుకునే భవిష్యత్తుని తీవ్ర ప్రమాదంలోకి నెడతాయి. మరియు జీవ ప్రపంచాన్ని మనకు తెలిసిన విధంగా

జీవం నిలబెట్టలేనట్లు మార్చగలవు. ఇప్పటి ఘర్షణ వైపుదారి తీసే పరిణామాల పర్యవసానాలను తప్పించుకోవాలంటే శీఘ్రంగా ప్రాథమిక మార్పులు రావాలి".

భూ వ్యవస్థలను అధ్యయనం చేసే వివిధ రంగాల శాస్త్రవేత్తలు స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో సమావేశమై "21వ శతాబ్దంలో మానవ జీవన సమర్థక వ్యవస్థలను నిర్వహించడం పై శాస్త్రవేత్తల సమ్మతి" ప్రకటనలో ఏమన్నారో చూద్దాం. 'భూమి శీఘ్రంగా అస్థిర స్థితికి చేరుతున్నది. మానవ ప్రభావాలు గ్రహానికి ఆందోళన కరమైన హాని చేస్తున్నాయి. జీవావరణంతో ప్రజల సహచర్యాన్ని విస్తృత విధానాలలో అధ్యయనం చేసే శాస్త్రవేత్తలుగా మానవులు ఎకలాజికల్ జీవ సమర్థక వ్యవస్థలను నాశనం చేస్తున్నారనడానికి నిదర్శనాలు ప్రబలమని అంగీకరిస్తున్నాము. లభ్యమైన ఉత్తమ శాస్త్రీయ సమాచారం ఆధారంగా మన ప్రస్తుత మార్గంలో కొనసాగితే, 2050 నాటికి మానవ జీవన ప్రమాణం గణనీయంగా క్షీణిస్తుందని మేమంగీకరిస్తున్నాము"

ఈ మధ్యనే జరిగిన మేరీలాండ్ యూనివర్శిటీలో ప్రకృతి - మానవ సహచర్యం పై జరిగిన అధ్యయనం పారిశ్రామిక నాగరికత తిరుగులేని పతనానికి చేరువలో వుందని తెలుపుతోంది. "గత 5 వేల సంవత్సరాలలో పురోగమించిన నాగరికతలెన్నో పతనమయ్యాయి. పతనం తరువాత శతాబ్దాల పాటు జనాభా, సంస్కృతి క్షీణతా, ఆర్థిక తిరోగమనం తరచుగా జరుగుతూ వచ్చింది. ఒకో పతనానికీ వేరు వేరు కారణాలు చెబుతూ వచ్చినా, వీటన్నింటికీ కలిపి సార్వజనీన వివరణ యివ్వవలసి వుంది. ప్రస్తుతమున్న ఆర్థిక స్థిరీకరణ వల్ల పతనాన్ని తప్పించుకోవడం చాలా కష్టం. విధానాలలో పెను మార్పులు చేయడమే కాక అసమానతలను పూర్తిగా తగ్గించే, జనాభా పెరుగుదలను ఆపే చర్యలు తీసుకోవాలి. ఆర్థిక స్థిరీకరణ లేకపోయినా సగటు క్షీణత చాలా ఎక్కువగా వుంటే పతనం తప్పదు. ఏమైనా, ప్రకృతి తలసరి క్షీణతని సుస్థిర స్థాయికి తగ్గించ గలిగితేనూ, వనరులను సబబుగా సమాన స్థాయిలో పంచగలిగితేనూ, పతనాన్ని తప్పించుకోవచ్చు. జనాభా సమతుల్యతను చేరవచ్చు".

నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్ ప్రచురించిన డిసెంబరు 2013 నివేదిక "చెట్ల కాండంలో వలయాలూ, సముద్రపు అడుగున అవక్షేపాలూ, మంచు అంతర్భాగాలూ నుండి లభించిన సమాచారం ప్రకారం భూమి శీతోష్ణస్థితి చరిత్రలో వేగంగా జరిగిన పెను మార్పులతో కూడి వున్నది. అవి దశాబ్దాలలో గాని, ఒకోసారి కేవలం కొన్ని సంవత్సరాలలోనే జరిగాయి." అని చెబుతోంది. "సైన్సు" పత్రిక డిసెంబరు 2009 లో వచ్చిన ప్రసిద్ధ వ్యాసంలో "మధ్య మయోసీస్ కాలంలో ఉష్ణోగ్రతలు ఇప్పటికంటే 3 నుండి 6 డిగ్రీలు అధికంగా వున్నప్పుడు, సముద్రాల మట్టం 25 నుండి 40 మీటర్లు అధికంగా వుంది. బొగ్గుపులుసు వాయువు సాంద్రత ఇప్పటి స్థాయిలోనే వుంది. అని తెలుపుతోంది. అంటే సస్యశ్యామలమైన తీర ప్రాంతాలు సముద్రంలోకి వెళ్ళి పోతాయి. కోల్‌కతా, ముంబై, చెన్నై, తదితర తీర ప్రాంత నగరాలన్నీ సముద్ర గర్భంలో చేరిపోతాయి.

థామస్ స్టోకర్ జనవరి 2013 'సైన్స్' జర్నల్ పరిశోధనా వ్యాసంలో విడుదల చేసిన మొత్తం కర్బన ఉద్గారాలకీ, ఉష్ణోగ్రత పెరుగుదలకీ వున్న సంబంధాన్ని విశదీకరిస్తూ, ఇప్పటికే వెసులు బాటు కోల్పోయామనీ, ఇప్పుడు ఉద్గారాలెంతగా తగ్గించినా ఉష్ణోగ్రత పెరుగుదలను పూర్తిగా నిరోధించలేమనీ తెలియజేశారు. ఆ పరిశోధనా పత్రంలో యిచ్చిన ఉష్ణోగ్రత పెరుగుదల, ఏ సంవత్సరం నుండి ఉద్గారాలను నియంత్రిస్తాం. 5 శాతం చొప్పున కర్బన ఉద్గారాలు తగ్గించినా ఉష్ణోగ్రత పెరుగుదలని 1.5 డిగ్రీలకు మించకుండా నియంత్రించే అవకాశాన్ని 2012 లోనే కోల్పోయాం. 2 డిగ్రీలకు నియంత్రించే అవకాశాన్ని 2027 వరకూ ఆగితే కోల్పోతాం. ఆయా సంవత్సరాలలో కర్బన ఉద్గారాలని పూర్తిగా నిలిపి వేసినపుడు ఉష్ణోగ్రత పెరుగుదల కనిష్ఠ స్థాయిని అన్నిటి కంటే ఎక్కువ చూపుతుంది. యథావిధి కొనసాగిస్తే 2028 నాటికి 1.5 డిగ్రీలకూ, 2044 నాటికి 2 డిగ్రీలకూ ఉష్ణోగ్రత పెరుగుదలను నియంత్రించే అవకాశాన్ని కోల్పోతాం. శాస్త్ర విజ్ఞానాన్ని లాభార్జనకే వాడుకుంటున్న మన సమాజం, హెచ్చరికలను పెడచెవిన పెడుతున్నది. ఊహకందని, ప్రస్తుత జీవనాన్ని కొనసాగించలేని ప్రపంచం వైపు అడుగులు వేస్తున్నా మనే స్పృహ కూడా లేకుండా ప్రవర్తిస్తున్నాం. సమస్య తీవ్రతను గుర్తించలేని దుస్థితిలో వున్నాం.

క్లైమేట్ సమస్య రోజు రోజుకీ క్లిష్టమవుతున్నది కాని ఏ రాజకీయ పార్టీ ప్రణాళికలోనూ చోటుచేసుకోవడం లేదు.

ఈ నేపథ్యంలో మనకు ఎన్నికలు జరుగనున్నాయి. ఓట్ల కోసం నాయకులు మన దగ్గర కొస్తారు. వారితో మనమేమి చర్చించాలి? ఏ ప్రశ్నలు లేవనెత్తాలో పరిశీలిద్దాం.

శాస్త్రవేత్తలు ఈ ప్రమాదం నుండి బయటపడడానికి కేవలం 15 నుండి 20 సంవత్సరాల కాలంలో పూర్తిగా ప్రకృతి సమతుల్య విధానాలకు మారాలనీ లేకుంటే భావితరాల మనుగడ ప్రశ్నార్థకమంటున్నారు. ప్రస్తుతం ఏ పార్టీ విధానాలలోనూ ఈ విషయాలకు చోటు లేదు.

మానవ నాగరికతా నిర్మాణానికి శక్తి మూలాధారం. చవకగా, విస్తారంగా లభ్యమవుతూ వచ్చిన శిలాజ ఇంధనాలు ఈనాటి జీవన ప్రమాణాలను సాధ్యం చేశాయి. ఈనాడు మన ఆర్థికవ్యవస్థలు పూర్తిగా చమురు లభ్యతతో ముడిపడి వున్నాయి. 2008లో చమురు ధర బారెల్‌కి 147 డాలర్లకి చేరగానే అమెరికాలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. త్వరలోనే ఆ పరిస్థితి పునరావృతం కానుంది. మనకు దేశీయ చమురు వనరులు అతిస్వల్పం. అవి త్వరలోనే ముగియనున్నాయి. 75 శాతం పైగా దిగుమతులపై ఆధారపడుతున్నాము. బొగ్గు కూడా 10 శాతం దిగుమతి చేసుకుంటున్నాము. పెరిగిన ఇంధన దిగుమతులు రూపాయి మారకం విలువ దిగిపోవడానికి హేతువయ్యాయి. ఇంధనం లేకుంటే, ఆర్థిక వ్యవస్థ లేదు. ఇంధనం విషయంలో రెండు ముఖ్య సమస్యలున్నాయి. 1 ఇంధన లభ్యతకి భద్రత కరువవడం 2. ఉన్న శిలాజ ఇంధనాలను కూడా శీతోష్ణస్థితి మార్పు నియంత్రణలో వుంచడానికి వాడుకోలేని పరిస్థితి. ఉష్ణోగ్రత పెరుగుదలని 2 డిగ్రీలకు నియంత్రించడానికి 80 శాతం పైగా వనరులను వాడుకోలేని స్థితి.

రాష్ట్ర విభజన నేపథ్యంలో సింగపూరుగా మారుస్తాం. దక్షిణ కొరియాగా తయారు చేస్తామంటూ నాయకులు ఊదర గొడుతున్నారు. వాస్తవ ప్రపంచంలో అవకాశాలు లేవు. అటు వైపుగా అడుగులు ప్రమాదకరం కూడా. కోస్టల్ కారిడార్, పిసిపిఐఆర్, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లతో ప్రయోజనం పొందే వారికంటే విస్థాపనతో నష్టపోయి గ్రామీణ ప్రజలే ఎక్కువ వుంటారు. ఇంతవరకూ జరుగుతూ వచ్చిందీ అదే. పిసిపిఐఆర్‌ని సింగపూరులో వున్నదాని నమూనాలో ప్రతిపాదించారు. అక్కడ మొత్తం ఉద్యోగులు 1200 ల లోపే. కాని మన దగ్గర 12 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామంటున్నారు. ఆధునిక పరిశ్రమలలో ఉద్యోగం కల్పించడానికి సగటున ఒక ఉద్యోగానికీ ఎంత పెట్టుబడి కావాలో ఆయా కంపెనీల సమాచారం నుండి లెక్క కట్టవచ్చు. థర్మల్ విద్యుత్ కేంద్రాలలో సగటున ఒక ఉద్యోగానికి 30 కోట్ల రూపాయల పెట్టుబడి అవసరమవుతుందని కోస్తా ఆంధ్రాలోని ప్రతిపాదనలు చూపుతున్నాయి. రాష్ట్రంలో ఏటా విద్య ముగించి ఉద్యోగాన్వేషణలో చేరే యువత సంఖ్య ఎంత? వారందరికీ ఉద్యోగాలు కల్పించడాని కవసరమయ్యే పెట్టుబడి ఎంత? అది చాలా పెద్ద సంఖ్య అవుతుంది. ఏటా అంత పెట్టుబడి సాధ్యమూ కాదు, ఆ పరిశ్రమల కవసరమయ్యే ఇంధనమూ, ముడి సరుకులూ చవకగా లభ్యమూ కావు. ఐరోపాలో పారిశ్రామిక విప్లవంలో భాగస్వాములైన దేశాలెన్నో ఈనాడు అప్పుల ఊబిలో కూరుకుపోయి, నిరుద్యోగం పెరిగిపోయి సంక్షోభంలో వున్నాయి. స్పెయిన్, పోర్చుగల్, ఐర్లండ్, గ్రీస్, ఇటలీ తదితర దేశాలిందుకు ఉదాహరణ. విఫలమైన నమూనాని అనుకరించడం సరికాదు.

20వ శతాబ్దం నాటి అభివృద్ధి అవకాశాలు ఈనాడు లేవు. మనకు దారులు మూసుకుపోయాయి. చైనా ఆర్థిక వృద్ధిలో దూసుకుపోయింది. దాని పర్యవసానాలు ఇప్పుడే అనుభవంలోకి వస్తున్నాయి. నగరాలలో వాయు కాలుష్యం హద్దులు మీరింది. ఏటా చైనాలో 12 లక్షల మంది వాయు కాలుష్యం వల్ల మరణిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2012 లో మరణించిన వారిలో 8 మందిలో ఒకరు వాయు కాలుష్యం వల్ల మరణించారని తెలుపుతోంది. శిలాజ ఇంధనాలని వాడే అవకాశం దాదాపు మృగ్యం. ఉష్ణోగ్రత పెరుగుదలని 2 డిగ్రీలు మించకుండా నియంత్రించడానికి ప్రపంచానికి మిగిలిన కార్బన్ బడ్జెట్ 422 బిలియన్ టన్నులు. అది జులై 2040 నాటికి పూర్తవుతుందని కార్బన్ గడియారం చూపుతోంది.

ఇన్ని పరిమితులూ, అడ్డంకులూ గుర్తించకుండా మాట్లాడే రాజకీయ నాయకులు మనని నట్టేట్లో ముంచరా? అందుకే మనమే దిశా నిర్దేశికులం కావాలి. మన జీవితాలను మనమే చక్క దిద్దుకునే దిశగా అడుగులు వేయాలి.

**- ప్రొ॥ కె. బాబూరావు**

## పాఠకులకు విజ్ఞప్తి

**వారణాసి కేంద్రంగా లోకవిద్యాజనాందోళన దేశ రాజకీయ పరిణామాలపై తన ఆలోచనలను ప్రత్యామ్నాయ అభివృద్ధి దృక్పథంను ప్రచారం చేయటంలో భాగంగా లోకవిద్యా ప్రపంచం 2012 జనవరిలో ప్రారంభించాం. రాష్ట్ర వ్యాప్తంగా 1000 కాపీలు వరకు పంపుతున్నాం. పత్రిక యెడల స్పందన బాగుంది. పత్రిక ముద్రణ, ఖర్చులు పెరగడంతో పత్రిక నిర్వాహణ కష్టం అవుతోంది. ఈ పరిస్థితితుల్లో పత్రికను క్రమబద్ధంగా తీసుకురావడం కోసం పాఠకులు తమవంతు ఆర్థిక సహాయం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.**

**పత్రికకు విరాళాలు పంపేవారు ఈ క్రింది బ్యాంక్ అకౌంట్‌కు పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.**

**T. Narayana Rao,**
**S.B.H, A/c No. 62222079499,**
**IFSC code:SBH Y0021364**
**Gaddiannaram Branch, Hyderabad.**

**జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.**

## Form - IV
## (See Rule 8)
## Statement of Ownership and other particulars of Lokavidya Prapamcham

1. Place of Publication : Hyderabad
2. Periodicity : Fortnightly
3. Printers Name & Address : **T.Narayana Rao,** D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 500 060
4. Publishers Name & Address : -do-
5. Editors Name : **T. Narayana Rao**
6. Nationality : Indian
7. Name & Address of Individual who own of Newspaper : **T. Narayana Rao,** D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 500 060

I T. Narayana Rao here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**T. Narayana Rao,** Publisher

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.**

